# నాగరికత

"తూర్పు తూర్పే—పడమర పడమరే! ఈ రెండూ ఎప్పుడూ కలవ్వు" అన్నాడు కిప్లింగ్.

సామ్రాజ్యతత్వం కన్నులకు ఎగదట్టిన కిప్లింగ్ ఈ విధంగా వాగటంలో ఆశ్చర్యం లేదు. "తెల్లతోలు ప్రపంచానికి మోక్షాన్ని కట్టిపెడుతుంది" అనుకునే బతికులు ఇలాంటి వెర్రి వ్రాతలు వ్రాయటంలో ఆశ్చర్యం లేదు. "తెల్లవారు ప్రభుత్వం చెయ్యటానికీ, నల్లవారు జోహుకుం కొట్టటానికీ పుట్టా"రని ఈబుద్ధిజాడ్యజనితోన్మాదుల ఉద్దేశం.

ఈ వాదం ఎంతవరకు నిజం?

ప్రాచ్య పాశ్చాత్య నాగరికతల్లో విపరీతమైన భేదముందనీ, ఈ భేదం ఎప్పుడూ ఇల్లాగే ఉంటుందనీ కొందరు సామ్రాజ్యవాదులు అంటారు. దీన్నే భారతీయుల్లో కొందరు, "పాశ్చాత్యులది జడవాదం; మనది ఆధ్యాత్మిక వాదం" అని చెబుతారు. పాశ్చాత్యులు తమ భౌతిక నాగరికతను చూచుకొని విర్రవీగితే, భారతీయులు తమ ఆధ్యాత్మిక నాగరికతను తలచుకొని ముడుసుకుంటారు. అసలు ఈ నాగరికతల్లో ఇంత వ్యత్యాసం ఉందా? ఈ నాగరికతలు ఏకం కావా?

ప్రథమంలో ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో ఒకటే నాగరికత ఉండేది. జిజ్ఞాస మానవుని స్వభావంలో ఉండటం

వల్ల అతడు హేతువాదాన్ని సాధనంగా తీసుకొని జీవితాన్ని గడిపాడు. ఉపనిషత్తులను పరిశీలిస్తే మానవుని స్వభావం తేలిగ్గా అర్థమవుతుంది. మానవునికి కలిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పటానికి అవి ప్రయత్నించినయ్. "దేవుని స్వభావం ఎటువంటిది ?" "దేవుని దర్శనం యేవిధంగా దొరుకుతుంది ?" అనే మానవుని జిజ్ఞాస వీటిని సృష్టించింది.

కాని అప్పుడు జ్ఞానం వృద్ధిచెందకపోవటంవల్లా, అప్పటికి మానవుడు ప్రకృతిని లోబరచుకునే శక్తులను సంపాదించుకొనలేక పోవటంవల్లా, మానవునికి కలిగే ఈ శంకలను జ్ఞానం తీర్చలేకపోయింది. ఇక మానవుడు చేసేది లేక విశ్వాసాన్ని ఆశ్రయించాడు. ఈ "విశ్వాసం" ఆధ్యాత్మిక నాగరికతకు దారితీసింది.

తరువాత కొద్దికాలానికి సైన్సు వృద్ధిచెందటంవల్ల పాశ్చాత్య దేశాలు యీ నాగరికతనుంచి తప్పించుకొని అభివృద్ధి చెందాయి. మన దేశంవంటి దేశాలు మాత్రం, కొన్ని కారణాలవల్ల సైన్సు సహాయం తీసుకోక, వెనుకటి నాగరికతలోనే కుమిలిపోతున్నయి. కనుక భౌతిక ఆధ్యాత్మిక నాగరికతల భేదం యించు మించు 500 సంవత్సరాల క్రింద కలిగింది.

ఇప్పుడు మనం స్వాతంత్ర్య సమరానికి సమకట్టాం కనక మనకకూడా భౌతిక నాగరికతకోసం, పాశ్చాత్యులు ఆ నాగరికతవల్ల పొందిన లాభాలకోసం ప్రయత్నిస్తున్నాం. మనంకూడా మనుష్యులమే గనక, భౌతిక ప్రపంచంతో, భౌతిక వాదంతో సంబంధం వదలుకోలేం. "జడవాదం",

"పిడివాదం" అనుకొని ఏ పదిరోజులో ముక్కు-మూసుకొని కూర్చున్నా, తరువాత అయినా ఊపిరాడక ఇతర దేశాలతోపాటు వృద్ధిచెందటానికి ప్రయత్నిస్తాం.

కనుక కిప్లింగ్ మహాశయుడు, "తూర్పు తూర్పే - పడమర పడమరే" అనటం ఆయన అజ్ఞానాన్నో, సామ్రాజ్యతత్వ పిరాయింపునో, బుద్ధిజాడ్యాన్నో సూచిస్తుంది. "మాది ఆధ్యాత్మిక నాగరికత" అని మన నాగరికతను పొగుడుకోవటం "పాశ్చాత్యులది భౌతిక నాగరికత" అని వారిని నిందించటం కూడా అనారోగ్యాన్నే సూచిస్తుంది. పూర్వం మనం ఏ పరిస్థితుల్లో, ఏ నాగరికతలో, ఎంత జ్ఞానంలో ఉన్నా, ఇప్పుడుమాత్రం పాశ్చాత్యులకంటే ఏ 500 ల సంవత్సరాలో వెనకబడి ఉన్నాము. అందుకనే, అభివృద్ధిలో వారితో కలుసుకోటానికే, మనం స్వాతంత్ర్యం కావాలంటున్నాం; ఆంగ్లేయులు మూటా ముల్లెలతో ఖాళీ చెయ్యాలంటున్నాం; మన డబ్బు మనకే ఉండాలంటున్నాం. భౌతికంగా పాశ్చాత్య నాగరికతను ఈవిధంగా అనుకరిస్తూ, దాన్ని నిందించి, మనం విడిచిపెడుతున్న ఆధ్యాత్మిక నాగరికతను పొగట్టం ఆరోగ్యవంతులు చెయ్యవలసిన పనికాదు.

ఇప్పుడు ప్రాచ్య పాశ్చాత్య నాగరికతలకున్న భేదం ఏమిటి? భౌతికవాదం అంటే ఉలిక్కి-పడవలసిన అవసరం ఏముంది?

సర్ రాధాకృష్ణ పాశ్చాత్య నాగరికతకూ మన నాగరికతకూ మూడు భేదాలు చెప్పాడు. నేటి పాశ్చాత్య నాగరికతకు (1) మానవాధికారం, (2) హేతువాదం, (3) ప్రజా

స్వామికం ముఖ్యలక్షణాలు. మన నాగరికతలో ఈ లక్షణా లకు తావులేదు. నేడు ప్రజాబాహుళ్యానికి ఏ లక్షణాలు ప్రాణాధారాలో, ఏ లక్షణాలు లేకపోతే మానవుడు పశువుగా తయారవుతాడో, అటువంటి లక్షణాలకు మన "ఆధ్యాత్మిక నాగరికత"లో తావులేదు. అటువంటి నాగరికతను మనం పొగుడుకుంటున్నాం.

దీనికంటే, ఇతర దేశాలకంటే మనం ఎంత వెనకబడి ఉన్నామో తెలుసుకొని, దేశాభివృద్ధికి ప్రయత్నించటం మేలు. ఈ ఆధ్యాత్మిక నాగరికత అనే మత్తులో పడివుండటం విదేశ ప్రభుత్వానికి మంచిది గనక, అది దాన్ని ప్రోత్స హిస్తుంది. కనుక విదేశ ప్రభుత్వం పోతేగాని మన అభివృద్ధి విజృంభించదు.

అప్పుడుగాని, "తూర్పు తూర్పే-పడమర పడమరే!" అన్న కిప్లింగ్ వాక్యం ఎగిరిపోదు.

## కులతత్వం - జాతీయవాదం

**బానిసవర్గం తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోటానికి చేసే ప్రయత్నం కులతత్వం.**

**అధికారంలో వున్నవర్గం మిగిలిన వర్గాలమీద తన పెత్తనం సుస్థిరం చేసుకోటానికి చేసే ప్రయత్నం జాతీయవాదం.**

—o—